క్లుప్తంగా

జిల్లా అథ్లెటిక్స్ సంఘం నూతన కార్యవర్గం

నాగమల్లితోట జంక్షన్: జిల్లా అథ్లెటిక్స్ సంఘం నూతన అధ్యక్షునిగా డాక్టర్ కె.స్వర్ణన్‌రాజు ఎన్నికయ్యారు. సంఘ సర్వసభ్య సమావేశం, నూతన కార్యవర్గం ఎన్నిక కాకినాడలో సోమవారం జరిగాయి. కార్యదర్శిగా కె.సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా డాక్టర్ ఎస్‌వీవీ వర్మ, ఉపాధ్యక్షులుగా తాతబ్బాయి, రంగారావు, సంయుక్త కార్యదర్శులుగా బీవీజీటీ రాజు, ప్రసాద్‌రెడ్డి ఎన్నికయ్యారు. సంఘ రాష్ట్ర కోశాధికారి ఆదిరెడ్డి సత్యనారాయణ, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్‌కుమార్ పరిశీలకులుగా హాజరయ్యారు.

వేంకటేశ్వరస్వామి వారికి రూ.3.50 లక్షల ఆదాయం

బోట్‌క్లబ్: స్థానిక వెంకట్ నగర్ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 84 రోజులకు గాను రూ.3.60 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ బిక్కిన వెంకట్రాయ చౌదరి తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ కాకినాడ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు గంగాధర్ జయంతి వేడుకలు

కాకినాడ కల్చరల్: ఆర్కెస్ట్రా పితామహుడు దివంగత పెద్దిరెడ్డి గంగాధర్ మాస్టర్ 85వ జయంతి వేడుకలు మంగళవారం సాయంత్రం స్థానిక సూర్య కళామందిర్‌లో నిర్వహించనున్నారు. మాస్టర్ తనయుడు పెద్దిరెడ్డి సతీష్ ఈ విషయం సోమవారం తెలిపారు. మాస్టారి జయంతిని సంగీత విభావరి దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో ముఖ్య అతిథులుగా ఎంపీ వంగా గీత, రూరల్, సిటీ ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలి



సదస్సులో ప్రసంగిస్తున్న వెంకట్రావు

కాకినాడ రూరల్: వేసవి సెలవులు ముగిసిన వెంటనే బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని తల్లిదండ్రులకు జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు విజ్ఞప్తి చేశారు. బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యాన సర్పవరం జంక్షన్‌లో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం బోధనను సీఎం జగన్ తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారన్నారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం, బూట్లు, నోట్ పుస్తకాలు అందించడమే కాకుండా, మధ్యాహ్నం నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, సత్యనారాయణ, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

పసిపాప ప్రాణం కోసం..



బాలిక కుటుంబీకులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమర్జెన్సీ బ్లడ్ గ్రూప్ మిత్ర బృందం, సతీష్

కాకినాడ క్రైం: ఓ పసిపాప ప్రాణ రక్షణకు స్థానిక యువతతో పాటు ఓ స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చిన వైనమిది. తాళ్లరేవుకు చెందిన పంపన రామకృష్ణ, లలిత దంపతుల మూడేళ్ల కుమార్తె ఉజ్వల ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో ఆసుపత్రి పాలైంది. విషయం తెలిసిన ఎమర్జెన్సీ బ్లడ్ గ్రూప్ మిత్ర బృందం సభ్యులు చలించిపోయారు. వారు రూ.19,150 మొత్తాన్ని సమకూర్చి, శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు సతీష్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందించాలని సంకల్పించారు. దీనికి సతీష్ తమ సంస్థ నుంచి మరో రూ.10,850 కలిపి, మొత్తం రూ.30 వేలను సోమవారం బాలిక కుటుంబీకులకు అందజేశారు.

నాయీబ్రాహ్మణ కులాన్ని కించపరచడంపై ఆందోళన

కాకినాడ సిటీ: కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని పరామర్శించేందుకు వెళ్లిన దంతులూరి కృష్ణను ఈనాడు పత్రిక 'మంగలి కృష్ణ' అని సంబోధించడంపై ధన్వంతరి నాయీబ్రాహ్మణ సమాఖ్య, నవసమాజ్‌లు కలెక్టరేట్ వద్ద సోమవారం సంయుక్తంగా ఆందోళన నిర్వహించాయి. నాయీబ్రాహ్మణ కులాన్ని కించపరచకుండా మంగలి, మంగలోడా అని పిలవరాదంటూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తు చేశారు. ఈనాడు యాజమాన్యంపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే తమ ఆందోళన ఉధృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ధన్వంతరి నాయీబ్రాహ్మణ సమాఖ్య ప్రతినిధులు సుందరపల్లి గోపాలకృష్ణ, వెన్నేటి సత్యనారాయణమూర్తి, బీసీ నాయకులు చొల్లంగి వేణుగోపాల్, తానవరపు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాబూ.. మేమంటే అంత చులకనా?

- మా ఇళ్ల స్థలాలను సమాధులతో పోలుస్తారా?
- చంద్రబాబు వ్యాఖ్యలపై నిరుపేదల మండిపాటు
- కాకినాడ సిటీ, రూరల్‌లో భారీ నిరసన ర్యాలీలు

'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పథకంలో రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న స్థలాలను సమాధులతో పోలుస్తూ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు చేసిన అనుచిత వ్యాఖ్యలపై గృహ నిర్మాణ లబ్ధిదారులు, వైఎస్సార్ సీపీ నేతలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆయన వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా కేంద్రం కాకినాడలోను, కాకినాడ రూరల్‌లోను సోమవారం భారీ ర్యాలీలు నిర్వహించారు. పేదలంటే అంత చులకనా అంటూ చంద్రబాబు తీరును ఎండగట్టారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తదితరులు

టీడీపీకి ఆల్రెడీ సమాధి కట్టారు

చంద్రబాబుపై రూరల్ ఎమ్మెల్యే మాజీ మంత్రి, కురసాల కన్నబాబు మండిపాటు

కాకినాడ రూరల్: కడుపు మంట బ్యాచ్‌కు అధ్యక్షుడుగా ఉన్న చంద్రబాబునాయుడు పేదల ఇళ్ల స్థలాలను సమాధులతో పోలుస్తూ హేళన చేస్తున్నారని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు 32 లక్షల ఇళ్ల స్థలాలు ఇచ్చి, సత్సంకల్పంతో పేదలకు ఇళ్లు కట్టిస్తుంటే చంద్రబాబు ఓర్వలేకపోతున్నారని అన్నారు. 'కొత్తగా మీరేమీ కంగారు పడనవసరం లేదు. మీ పార్టీకి పేదలు ఆల్రెడీ సమాధి కట్టారు' అని అన్నారు. చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా కన్నబాబు ఆధ్వర్యాన రూరల్ నియోజకవర్గంలో సోమవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రమణయ్యపేట వైద్య నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి సర్పవరం జంక్షన్, అచ్చంపేట జంక్షన్ మీదుగా తిమ్మాపురం గ్రామం మీదుగా తిమ్మాపురం జగనన్న లే అవుట్ వరకూ జరిగిన ఈ ర్యాలీలో వేలాదిగా వైఎస్సార్ సీపీ శ్రేణులతో పాటు పేదలు పాల్గొన్నారు. చంద్రబాబుకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. చంద్రబాబు పిచ్చి పట్టి ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని వారు మండిపడ్డారు. ర్యాలీ ఆద్యంతం 'జై జగన్' నినాదాలు మార్మోగాయి.



చంద్రబాబు వ్యాఖ్యలను ఖండించిన తిమ్మాపురం జగనన్న లే అవుట్ గృహ నిర్మాణ లబ్ధిదారు శివమ్మతో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

జగనన్న కాలనీలో పేదల ఇళ్ల నిర్మాణాలను కన్నబాబు పరిశీలించారు. పేదల ఇళ్లను చూపి, వీటినా సమాధులని చంద్రబాబు పోల్చడమంటూ మండిపడ్డారు. జగనన్న ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించుకుని కాపురం ఉంటున్న తిమ్మాపురానికి చెందిన లబ్ధిదారు తుమ్మిశెట్టి శివమ్మను ఇల్లు ఎలా ఉందని ప్రశ్నించారు. తమకు 27 ఏళ్లుగా ఇల్లు లేదని, జగనన్న వచ్చాక పట్టా ఇవ్వడంతో సొంతిల్లు నిర్మించుకున్నామని, పేదల ఇంటిని సమాధులతో పోల్చడం తప్పని, పిచ్చి మాటలు మాట్లాడకూడదని శివమ్మ చెప్పింది. మరో ఇంటిని ఆధునిక హంగులతో అందంగా నిర్మించుకోవడం చూసి, కన్నబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక ఇంటి డాబా పైకి ఎక్కి, అక్కడి నుంచి 'ఇవి కావా పేదల ఇళ్లు? ఏకంగా ఊరే నిర్మించారు సీఎం జగన్' అని అనడంతో అక్కడున్న పేదలంతా చప్పట్లతో ఆనందం వ్యక్తం చేశారు.

అనంతరం కన్నబాబు మీడియాతో మాట్లాడుతూ, పేదలకు ఏమైనా చేస్తున్నారంటే చంద్రబాబుకు వెంటనే కడుపు మంట వచ్చేస్తుందని, ఆ బాధను వెళ్లగక్కకుండా ఉండలేరని విమర్శించారు. తన హయాంలో పేద కుటుంబానికి ఒక్క సెంటు స్థలం కూడా ఇవ్వని చంద్రబాబు.. నేడు సీఎం జగన్ రాష్ట్రంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే సెంటు స్థలం సమాధికి పనికి వస్తుందని చెప్పడం చాలా దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నాయకుడు జగన్ పేదల పక్షాన నిలబడితే చంద్రబాబు పెత్తందార్ల పక్షాన నిలబడ్డారని కన్నబాబు చెప్పారు. తమ నాయకుడు అమరావతిలో 50 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి, అన్ని వర్గాల రాజధానిగా, సామాజిక రాజధానిగా ఉండాలని భావిస్తుంటే.. చంద్రబాబు తన సొంత మనుషుల కోసం అమరావతి రియల్ ఎస్టేట్ రాజధానిగా ఉండాలనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తన నియోజకవర్గంలో 32 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. రాజమహేంద్రవరం మహానాడులో చంద్రబాబు కారుకూతలు, పిచ్చి కూతలు, కడుపు మంట కూతలు కూశారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి డీబీటీ కింద నేరుగా డబ్బులు ఇస్తుంటే.. చంద్రబాబు, ఆయన తాబేదారులు, ఎల్లో మీడియా కలిసి రాష్ట్రాన్ని శ్రీలంక చేసేస్తారంటూ హేళన చేశారని గుర్తు చేశారు. మహానాడులో చంద్రబాబు కూడా ఉచిత పథకాలు ప్రకటించారని, ఆయన చేస్తే సింగపూర్ అవుతుందా అని ప్రశ్నించారు. చంద్రబాబు ఎప్పుడూ స్వయంప్రకాశం, జనం మనిషి కాదని ఆయన ఎప్పుడూ ఎల్లో మీడియా భుజాలపై ఊరేగవలసిందేనని, ఆయనకు జనం తగిన విధంగా బుద్ధి చెబుతారని కన్నబాబు అన్నారు. ఈ ర్యాలీని నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, కాకినాడ రూరల్, కరప జెడ్పీటీసీ సభ్యులు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ళ సుబ్బారావు, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, కరప ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకురాలు జమ్మలమడక నాగమణి, దూనబోయిన అరుణ, అనుసూరి ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి తదితరులు

పేదలపై అక్కసుతోనే దారుణ వ్యాఖ్యలు

వైఎస్సార్ సీపీ నగర మాజీ మేయర్ శివప్రసన్న

కాకినాడ: చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆదేశాల మేరకు స్థానిక త్రిపుర సుందరి ఆలయం సమీపంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ జరిగింది. పార్టీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. మెయిన్ రోడ్డు, జగన్నాథపురం వంతెన మీదుగా, సినిమా రోడ్డు, భానుగుడి సెంటర్ వరకూ జరిగిన ఈ ర్యాలీలో భారీ స్థాయిలో ప్రజలు పాల్గొన్నారు. శివప్రసన్న మాట్లాడుతూ, రాష్ట్రంలో 32 లక్షల మందికి, కాకినాడలో 30 వేల మందికి రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తే టీడీపీ ఓర్వలేకపోతోందని అన్నారు. తన హయాంలో సెంటు స్థలం కూడా ఇవ్వలేకపోయిన చంద్రబాబు ఇలాంటి దారుణమైన వ్యాఖ్యల ద్వారా పేదలపై తన అక్కసును చాటుకుంటున్నారని దుయ్యబట్టారు. లబ్ధిదారులు సుందరంగా ఇళ్లు కట్టుకుని ఆయన కళ్లు తెరిపించాలని పిలుపునిచ్చారు. కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కౌడా) చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ, నాడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయడంలో విఫలమైన చంద్రబాబు.. నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న స్థలాలను శ్మశానాలతో, సమాధులతో పోల్చడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. పేదల అభివృద్ధిని చంద్రబాబు ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ, పేదల అభివృద్ధి, సంక్షేమాన్ని ఓర్వలేని చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బైక్ ర్యాలీలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకటలక్ష్మి, మీసాల ఉదయ్‌కుమార్, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బాల సైంటిస్ట్‌కు రోటరీ గోల్డ్ సహకారం



పవన్ శ్రీకర్‌కు ల్యాప్‌టాప్ అందిస్తున్న రోటరీ గవర్నర్ భాస్కర్‌రామ్

బోట్‌క్లబ్: రోటరీ గవర్నర్ భాస్కరరామ్ చేతుల మీదుగా పదో తరగతి విద్యార్థి పవన్ శ్రీకర్‌కు సోమవారం అత్యాధునిక ల్యాప్‌టాప్ అందజేశారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జీవీ కృష్ణప్రకాష్ మాట్లాడుతూ, పరిశోధన రంగంలో పవన్ చేస్తున్న కార్యక్రమాలు జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించాయన్నారు. పరిశోధనలకు అవసరమైన ల్యాప్‌టాప్ కోసం తమ క్లబ్‌ను సంప్రదించగా మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. తద్వారా రూ.90 వేల విలువైన ల్యాప్‌టాప్ అందించామని తెలిపారు. బాల మేధావి పవన్ మాట్లాడుతూ, తన 12వ ఏట మెషీన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలాసిస్, ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ నేర్చుకున్నానని చెప్పారు. సాంస్కృతిక రంగం కోసం వినూత్న సాఫ్ట్‌వేర్లు తయారు చేశానని తెలిపారు. భరత నాట్యం, పోజ్ డిటెక్టర్, యోగాసనం డిటెక్టర్ వంటి కంప్యూటర్ విజన్ సాఫ్ట్‌వేర్లు రూపొందించానని చెప్పారు. తనకు ల్యాప్‌టాప్ అందించిన క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

8 అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: ఐసీడీఎస్ సామర్లకోట రూరల్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ హెల్పర్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి టి.దేవీరత్న పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. కాకినాడ రూరల్, సామర్లకోట రూరల్, పెదపూడి పరిధిలో 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కాకినాడ రూరల్ తూరంగి పగడాలపేట; సామర్లకోట రూరల్ పరిధి మాధవపట్నం, జి.కొత్తూరు, వీకే రాయపురం, వేట్లపాలెం (గాంధీ నగర్), వేట్లపాలెం (చాకలిపేట), నవర కొత్త కాలనీల్లోను; పెదపూడి మండలం పెదపూడి చాకలిపేటలోను హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. రోస్టర్ ప్రకారం ఈ పోస్టుల భర్తీ చేపట్టనున్నామని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 35 ఏళ్ల లోపు ఉండాలన్నారు. విధిగా పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. సెలక్షన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారని పద్మావతి తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వచ్చే నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా తమ దరఖాస్తులను సామర్లకోట రూరల్ ఐసీడీఎస్ పథక అధికారిణి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

'ఆ సమస్యలను నాకు నేరుగా తెలియజేయవచ్చు'



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ సిటీ: పారిశుధ్యం, తాగునీరు, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు నేరుగా తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ రావిరాల అన్నారు.

నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీకీ నాణ్యమైన పరిష్కారం అందిస్తామన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకూ రాలేని వారు ఆయా సచివాలయాల్లో కూడా దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు. టౌన్ ప్లానింగ్, పారిశుధ్యం, ఇంజినీరింగ్ సహా వివిధ విభాగాలకు సంబంధించి నాలుగు వినతులను కమిషనర్‌కు ప్రజలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, స్మార్ట్ సిటీ ఎస్‌ఈ సత్యకుమారి, ఈఈ వెంకట్రావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాసరావు, మేనేజర్ కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్
డో.నెం. 13-1-16, దివాహార్ వీధి, కాకినాడ.
ఫోన్: 0884-2867608, సెల్: 98488 14081

లారీ ఢీకొని రికవరీ ఏజెంట్ మృతి

కాకినాడ రూరల్: స్థానిక ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పీజీ సెంటర్ సమీపాన ఏడీబీ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. తిమ్మాపురం పోలీసుల కథనం ప్రకారం .. సామర్లకోట మండలం మేడపాడుకు చెందిన ఏడిద వీర వెంకట సూర్యనారాయణ (33) ఐసీఐసీఐ బ్యాంక్ రికవరీ ఏజెంట్‌గా పని చేస్తూ రమణయ్యపేటలో నివాసం ఉంటున్నాడు. స్నేహితుడిని స్కూటీపై సోమవారం సాయంత్రం సామర్లకోట రైల్వే స్టేషన్‌లో దింపి, రాత్రి తిరిగి ఇంటికి బయలుదేరాడు. నన్నయ పీజీ సెంటర్ సమీపానికి వచ్చేసరికి అతడి స్కూటీని వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొంది. రోడ్డుపై పడిపోయిన సూర్యనారాయణ తలపై నుంచి లారీ చక్రాలు దూసుకుపోయాయి. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సూర్యనారాయణకు ఏడాది క్రితమే వివాహమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఎస్సై నాగార్జునరాజు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మళ్లీ కుంభవృష్టి



పెద్దాపురం మండలం పులిమేరులో భారీ వృక్షం కూలడంతో నేలమట్టమైన పూరిల్లు



చెరువులా మారిన సామర్లకోట ఆర్టీసీ కాంప్లెక్స్

సామర్లకోట: వరుసగా రెండో రోజు కూడా సామర్లకోటలో కుంభవృష్టి కురియడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు, వర్షం బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. సోమవారం సాయంత్రం కూడా ఆకాశం చిల్లు పడిందా అన్న రీతిలో దాదాపు గంట పాటు కుండపోతగా భారీ వర్షం కురిసింది. రోహిణీ కార్తెలో ఎండలు ఎక్కువగా ఉంటాయని హడలెత్తిన వారికి ఈ వర్షాలు ఊరట కలిగించాయి. అయితే, భారీ వర్షానికి పట్టణంలోని అన్ని రోడ్లూ చెరువులను తలపించాయి. కొన్ని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు డ్రైన్లలో పడిపోవడంతో వాటిల్లోని నీరు రోడ్లపై ప్రవహించింది. రైల్వే స్టేషన్‌లో రేకు షెడ్లను నాసిరకంగా నిర్మించడంతో వాటి నుంచి వర్షం జోరున కురిసింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, సత్యనారాయణపురం, జయలక్ష్మీ థియేటర్, వెలమపేట, సంగీతరావుపేట, వీరరాఘవపురం, కొత్తూరు, భాస్కర్ నగర్, సాయి నగర్, గణేష్ కాలనీలు జలమయమయ్యాయి.

పెద్దాపురం.. అతలాకుతలం

పెద్దాపురం: మండలంలో కూడా సోమవారం సాయంత్రం భారీ వర్షం కురియడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మరోపక్క ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా విరుచుకుపడిన ఈదురు గాలులు, భారీ వర్షానికి మండలం అతలాకుతలమైంది. అర్బన్, రూరల్ ప్రాంతాల్లో చాలాచోట్ల భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగిపోయాయి. ప్రధానంగా ఏటిపట్టు ప్రాంతంలోని వడ్లమూరు నుంచి గోరింట, పులిమేరు, దివిలి, చంద్రమాంపల్లి, తాటిపర్తి, చదలాడ, ఉలిమేశ్వరం, కాండ్రకోట, మర్లావ, తూర్పుపాకల గ్రామాల ప్రజలు నానా అవస్థలూ పడ్డారు. అరటి, చెరకు పంట నేలకొరగడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని అధికారులు చెబుతున్నారు. పులిమేరు రజక కాలనీలో మూడిళ్లపై భారీ చెట్టు కూలడంతో మూడు నిరుపేద కుటుంబాలు రోడ్డున పడ్డాయి. రెవెన్యూ అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. సుమారు 25 స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కల్గింది. ఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది కృషితో సోమవారం సాయంత్రానికి చాలాచోట్ల సరఫరాను పునరుద్ధరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం ఉదయానికి కూడా విద్యుత్ సరఫరా జరగకపోవడంతో సేవలు నిలిచిపోయాయి.

సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

కాకినాడ సిటీ: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) కె.శ్రీరమణి ఆదేశించారు. ఈ పరీక్షల నిర్వహణపై తన కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆమె కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. జూన్ 2 నుంచి 10వ తేదీ వరకూ జిల్లాలోని 38 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అన్ని కేంద్రాల్లోనూ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యా శాఖాధికారి అన్నపూర్ణ, పోలీస్, మున్సిపల్, వైద్య, ఆరోగ్యం, పోస్టల్, ఏపీఈపీడీసీఎల్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

కరప: వలసపాకల గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త వనుం భాస్కర్ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సోమవారం పరామర్శించారు. భాస్కర్ తండ్రి పెద్ద మాచరరావు మృతి చెందడంతో ఈ పరామర్శ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, సర్పంచ్ వాసంశెట్టి రామారావు తదితరులు పాల్గొన్నారు.